క్లుప్తంగా

భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

కడప వైఎస్సార్ సర్కిల్ : భవన నిర్మాణ కార్మిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ కడప జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగసుబ్బారెడ్డి పేర్కొన్నారు. గురువారం నగరంలోని స్థానిక హోచిమెన్ భవన్‌లో నిర్వహించిన ఏపీ బిల్డింగ్-కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ కడప జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2018 నుంచి ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్ విడుదల చేయాలన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోరు నిర్వీర్యం చేయరాదన్నారు. ఈ సమావేశంలో ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ కడప జిల్లా ప్రధాన కార్యదర్శి ఉద్దె.మద్దిలేటి, జిల్లా నాయకులు లింగన్న, బాలాజీ, రామాంజనేయులు నాగేశ్వరరావు, సిద్దయ్య, జోసఫ్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపు సరికాదు

కడప వైఎస్సార్ సర్కిల్ : విద్యుత్ చార్జీలపెంపును తక్షణమే ఉపసంహరించుకోవాలని ఏపీ కాంగ్రెస్ కమిటీ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు పటాన్ మహమ్మద్ అలీ ఖాన్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ప్రజలను విద్యుత్ చార్జీలపై అదనపు రుసుముల పెంపు పేరుతో నిరంతరంగా దోపిడీ చేస్తున్నాయని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం స్లాబుల విధానాన్ని పూర్తిగా తొలగించి ఆస్థానంలో నాన్ స్లాబ్ విధానాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి ప్రసాద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

కడప వైఎస్సార్ సర్కిల్: కాంగ్రెస్ పార్టీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు విష్ణు ప్రీతం రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు చెప్పలి పుల్లయ్య పేర్కొన్నారు. గురువారం నగరంలోని ఇందిరా భవన్‌లో కాంగ్రెస్ పార్టీ కార్మిక విభాగానికి సంబంధించిన సభ్యత్వ నమోదు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కార్మిక శాఖ బలోపేతం చేయడం ద్వారా పార్టీకి మరింత బలం చేకూరుతుందన్నారు. ఈ సభ్యత్వ నమోదు ఈ నెల 10 నుంచి జులై 10 వరకు జిల్లాలోని అన్ని నియోజక వర్గాలోని మండలాల్లో నిర్వహిస్తామని వెల్లడించారు. సంఘటిత, అసంఘటిత రంగాల్లో పని చేస్తున్న కార్మికులు ఎవరైనా ఉచితంగా సభ్యత్వ నమోదు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నగర మహిళా అధ్యక్షురాలు లావణ్య, నాయకులు అశోక్‌రావు, ఎల్లయ్య, ఉదయ్, కేశవ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే ఆరోపణలు

చెన్నూరు : అభివృద్ధిని చూసి ఓర్వలేకే టీడీపీ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆర్‌వీ ఎస్ఆర్ మండిపడ్డారు. గురువారం ఆయన తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. కరోనా కష్ట కాలంలో ఏ తెలుగుదేశం నాయకుడు కూడా ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించకుండా కేవలం తమ ఇళ్లకే పరిమితమయ్యారన్నారు. ఆ సమయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల పక్షాన నిలబడి సంక్షేమ పథకాలు అందజేసి , సమస్యలు లేకుండా పాలన చేశారని గుర్తుచేశారు. నారా లోకేష్ యువగళం పాదయాత్రలో భాగంగా చెన్నూరు బహిరంగ సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డిపై అవగాహన లేని, పరిజ్ఞానం లేని అవాస్తవాలు మాట్లాడడం సరికాదన్నారు. రాజకీయ అవగాహన లేకుండా ఎవరో రాసిచ్చిన స్క్రిప్టును చదవడం తప్ప, ఆయన పాదయాత్రలో రైతుల సమస్యలు గానీ, ప్రజల సమస్యలు గానీ పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సిద్ది గారి వెంకటసుబ్బయ్య, మండల కో ఆప్షన్ మెంబర్ వారిష్, అబ్దుల్ రబ్, నిరంజన్ రెడ్డి, సొంట్యం నారాయణరెడ్డి, సాదు కిషోర్ పాల్గొన్నారు.

24 నుంచి శిక్షణ తరగతులు

కమలాపురం: ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాలపై భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ కోసమే జిల్లా స్థాయి శిక్షణా తరగతులను ఈ నెల 24వ తేదీ నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర తెలిపారు. గురువారం కమలాపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కమలాపురం నియోజకవర్గం, వీఎన్ పల్లె మండలంలో ఈ నెల 24నుంచి మూడు రోజుల పాటు సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి శిక్షణా తరగతులను జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ ఏరియా కార్యదర్శి చంద్రశేఖర్, ఏరియా కార్యవర్గ సభ్యులు పల్లా వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి ఉత్సవాలు

చక్రాయపేట: చక్రాయపేట మండలం సురభి గ్రామం నాగలగుట్టపల్లె సమీపాన వెలసిన దశరథ మహారాజు ఆలయంలో ఈ నెల 12 నుంచి ఉత్సవాలు జరుగుతాయని దశరథ మహారాజు ట్రస్ట్ చైర్మన్ దశరథ, ఆలయ కమిటీ చైర్మన్ సుబ్బరామయ్యలు తెలిపారు. 12న ఉదయం సీతా రాముల కల్యాణం నిర్వహించనున్నారు. 13న బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

మంజుమియా పార్కు సుందరీకరణ

- రూ. 15 లక్షలతో శరవేగంగా నిర్మాణ పనులు


గుంతబజారులోని మంజుమియా పార్కు

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగరంలోని మంజుమియా పార్కు కొత్త కళ సంతరించుకుంటోంది. అందరి దృష్టి ఆకర్శించేలా సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. పార్కు అభివృద్ధి పనులకు మున్సిపల్ కార్పొరేషన్ రూ. 15 లక్షలు మంజూరు చేసింది. దీంతో పనులు వేగంగా సాగుతున్నాయి. పార్కు చుట్టూ వెదురు బొంగులతో ప్రహరీ నిర్మించారు. ఈశాన్య దిశలో చిన్నద్వారం, పడమటివైపు ప్రధాన ద్వారం ఏర్పాటు చేశారు. దక్షిణాన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో ఏదైనా ప్రమాదం జరిగినా ఇబ్బంది లేకుండా తొమ్మిది అడుగుల ఎత్తుతో సేఫ్టీ వాల్ నిర్మిస్తున్నారు. పార్కు కింది భాగం టైల్స్‌తో నింపుతున్నారు. ప్రజలు కూర్చొనేందుకు వీలుగా నాలుగు వైపుల నాలుగు అరుగులు నిర్మిస్తున్నారు. అలాగే నాలుగు వైపుల నాలుగు కొళాయిలు ఏర్పాటు చేస్తున్నారు. మంజుమియా పార్కు పేరిట రెండు బోర్డులు ఏర్పాటు చేయనున్నారు. పార్కు చుట్టూ వివిధ రకాల అందమైన పూలమొక్కలు పెంచనున్నారు. రాత్రి వేళల్లో పార్కు శోభాయమానంగా ప్రకాశించేందుకు నాలుగు వైపుల నాలుగు ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేస్తున్నారు. వారం, పది రోజుల్లో పార్కు పునః ప్రారంభించనున్నట్లు సమాచారం.

- పెద్ద కుళాయికి మంచి రోజులు

నగరంలోని గుంతబజారులో ఎన్టీఆర్ సర్కిల్ సమీపాన మంజుమియా పార్కు ఉంది. దీన్ని ఒకప్పుడు పెద్ద కుళాయి లేదా బడా నల్ అని పిలిచేవారు. ఇక్కడ నాలుగు మున్సిపల్ కొళాయిలు ఉండేవి. స్థానిక వార్డు ప్రజలే కాకుండా నగరంలోని వివిధ ప్రాంతాల వారు సైకిళ్లు, రిక్షాలు, తోపుడుబండ్లపై ఇక్కడి నుంచి నీటిని తీసుకెళ్లేవారు. ఎన్నో దశాబ్దాలుగా కడప వాసుల దాహార్తి తీర్చి ఆదుకున్న ఈ పెద్దకుళాయిని 1891లో నాటి కౌన్సిలర్, సుప్రసిద్ధ యునాని రాజవైద్యులు హెచ్ఎస్ఏఎం మంజుమియా ఏర్పాటు చేశారు. ఆయన మున్సిపల్ చైర్మన్‌గా, తాలూకా, జిల్లా బోర్డు సభ్యునిగా, కడప గౌరవ మెజిస్ట్రేట్‌గా ప్రజలకు ఎన్నో విలువైన సేవలు అందించారు. నాటి బ్రిటీషు ప్రభుత్వం ఆయనకు ఖాన్ బహద్దూర్ బిరుదుతో సత్కరించింది. కాలక్రమంలో అధికారులు పట్టించుకోకపోవడంతో బిక్షగాళ్లకు, చిరు వ్యాపారులకు నిలయంగా మారి అపరిశుభ్రత నెలకొంది. దీంతో ప్రస్తుత వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ ఎస్ఎండీ షఫీ పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకోవడంతో పార్కుకు మహర్దశ వచ్చింది.

అందరి సహకారంతో అభివృద్ధి

డిప్యూటీ సీఎం అంజద్‌బాష, నగర మేయర్ సురేష్‌బాబు, కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్, ఇతర మిత్రుల సహకారం వల్ల మంజుమియా పార్కు సుందరీకరణకు నిధులు మంజూరయ్యాయి. నగర నడిబొడ్డున ఉన్న ఈ పార్కులో ప్రజలు ఆహ్లాదాన్ని పొందేందుకు వీలుగా అభివృద్ధి చేస్తున్నాం.

– ఎస్ఎండీ షఫీ, కార్పొరేటర్, 30వ డివిజన్, కడప

క్లాప్‌మిత్రలకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

– డీపీఓకు ఏఐటీయూసీ వినతి


డీపీఓ ప్రభాకర్‌రెడ్డికి వినతిపత్రమిస్తున్న బాదుల్లా తదితరులు

కడప సెవెన్‌రోడ్స్: జగనన్న క్లాప్ మిత్రలకు 12 నెలల పెండింగ్ వేతనాలను తక్షణమే విడుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, స్వచ్ఛభారత్ కార్మికుల యూనియన్ గౌరవాధ్యక్షుడు కేసీ బాదుల్లా గురువారం జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డిని కోరారు. గ్రామ పంచాయతీల్లో రోడ్లు, కాలువలు, పరిసరాలు శుభ్రం చేస్తున్న జగనన్న క్లాప్ మిత్రలకు వేతనాలు పెండింగ్‌లో ఉంచడంతో వారి కుటుంబాలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. పిల్లల చదువు, కుటుంబ పోషణ, వైద్య ఖర్చులకు చాలా అవస్థలు పడాల్సి వస్తుందన్నారు. కొన్ని పంచాయతీల్లో కార్మికుల పనులు నిలుపుదల చేశారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నెం. 680 ప్రకారం కనీస వేతనాలు రూ. 10 వేలు చెల్లించి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఆంజనేయులు, నగర అధ్యక్షులు సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

కడప సెవెన్‌రోడ్స్ : ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఫ్యాప్టో జిల్లా చైర్మన్ ఎస్.విజయ్‌కుమార్, సెక్రటరీ జనరల్ షేక్ మహమ్మద్ ఇర్షాద్ కోరారు. గురువారం జాయింట్ కలెక్టర్ గణేష్‌కు వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యలు దీర్ఘకాలికంగా అలాగే ఉన్నాయని పేర్కొన్నారు. జీఓ 117ను తక్షణమే రద్దు చేయాలని కోరారు. ఉపాధ్యాయులు నిరంతరం చేపడుతున్న బోధనేతర కార్యక్రమాల వల్ల విద్యాబోధన కుంటుపడుతోందని తెలిపారు. ఇందువల్ల ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 11వ పీఆర్సీ బకాయిలతోపాటు అన్ని రకాల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కోరారు. చట్టబద్ధమైన 12వ పీఆర్సీ వెంటనే నియమించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి ఇలియాస్‌బాష, రూటా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు రమణారెడ్డి పాల్గొన్నారు.

నగరపాలక సంస్థలో సమావేశ మందిరం ప్రారంభం


సమావేశ మందిరాన్ని ప్రారంభిస్తున్న మేయర్

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థలోని మూడో అంతస్తులో రూ.39లక్షలతో ఆధునీకరించిన సమావేశ మందిరాన్ని మేయర్ సురేష్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యాధునిక సదుపాయాలతో సమావేశ మందిరాన్ని తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముంతాజ్ బేగం, కార్పొరేటర్లు చెన్నయ్య, ఎం. సుబ్బారెడ్డి, మల్లికార్జున, రామలక్ష్మణ్‌రెడ్డి, కె. బాబు, సూర్యనారాయణరావు, షఫీ, అజ్మతుల్లా, బాలస్వామిరెడ్డి, కో ఆప్షన్ సభ్యులు పత్తిరాజేశ్వరి, బండి మరియలు, డివిజన్ ఇన్‌చార్జులు ఐస్‌క్రీం రవి, శ్రీరంజన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, అలీ అక్బర్, జమాల్‌వలీ, కె. రాజశేఖర్‌రెడ్డి, బండి ప్రసాద్, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

పసుపు కొనుగోళ్లలో నిబంధనలు సడలించండి

మైదుకూరు : రైతుల నుంచి పసుపు పంటను కొనుగోలు చేస్తున్న ప్రభుత్వం నిబంధనలను సడలించాలని బీజేపీ, ఏపీ రైతు సంఘం, సీపీఐ నాయకులు కోరారు. గురువారం మైదుకూరులోని మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన పసుపు కొనుగోళ్ల పరిశీలనకు కేంద్రానికి వచ్చిన ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డితో వారు మాట్లాడారు. పసుపు కొమ్ములను జల్లెడ పట్టడం, గ్రేడింగ్ చేయడం వల్ల రైతులు నష్టపోతున్నారని ఎమ్మెల్యేకు వివరించారు. దానిపై ఎమ్మెల్యే రఘురామిరెడ్డి స్పందిస్తూ, రైతులు నష్టపోకూడదన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

రతనాల వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాతమార్కెట్‌లోని రతనాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం స్వామివారి జన్మనక్షత్రమైన శ్రవణ పర్వదిన సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేకువజామున స్వామివారి మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా గజమాల, తులసీమాలతో అలంకరించారు. అలాగే లక్ష్మీతాదేవికి, శ్రీదేవి భూదేవి సమేత రతనాల వేంకటేశ్వర స్వామి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం మహిళలు కుంకుమార్చనలు చేశారు.

ఖరీఫ్ పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించాలి

కడప వైఎస్సార్ సర్కిల్ : కేంద్ర ప్రభుత్వం 2023 ఖరీఫ్ పంటలకు కనీస మద్దతు ధర విషయంగా రైతులపై కనికరం చూపకుండా కర్కశంగా వ్యవహరించడం దారుణమని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో గోధుమ తరువాత అత్యధికంగా పండించే, వినియోగించే పంట వరి విషయంగా కేంద్ర ప్రభుత్వం క్వింటాపై 143 రూపాయలు పెంచి రైతుల ఆదాయం రెట్టింపు చేశామని ప్రకటించడం దుర్మార్గమన్నారు. కరువు పీడిత రాయలసీమలో పండించే జొన్నకు 210 రూపాయలు, సజ్జకు 150 రూపాయలు, రాగికి 268 రూపాయలు, ప్రొద్దు తిరుగుడు పంటకు 360, పత్తికి 640రూపాయలు పెంచామని గొప్పలు చెప్పడం తగదన్నారు. మోదీ అధికారంలోకి రాకముందు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని నమ్మబలికారన్నారు. తీరా అధికారంలోకి రాగానే వ్యవసాయాన్ని పూర్తిగా కార్పొరేట్లకు కట్టబెట్టి రైతులను కూలీలుగా మార్చి అటు రైతులను ఇటు వినియోగదారులను ఏకకాలంలో దోపిడీ చేసేందుకు చట్టాలు తీసుకొచ్చారని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కనీసం మద్దతు ధర పెంచాలని ఆయన డిమాండ్ చేశారు.

కేసీ కెనాల్‌కు రెగ్యులర్ ఏఈని నియమించాలి

కడప వైఎస్సార్ సర్కిల్ : నగర పరిధిలోని కేసీ కెనాల్ పర్యవేక్షణకు రెగ్యులర్ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) ను తక్షణమే నియమించాలని సీపీఐ నగర కార్యదర్శి ఎన్ వెంకట శివ కోరారు. గురువారం సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కేసీ కెనాల్ పరిధిలో ఖాళీగా ఉన్న ఇద్దరు వర్క్ ఇన్‌స్పెక్టర్లను, 12 మంది లస్కర్ల పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఆదినిమ్మాయపల్లి ఆనకట్ట నుంచి నానా పల్లె వరకు గల కడప పరిధిలోని కేసీ కెనాల్ పర్యవేక్షణకు అసిస్టెంట్ ఇంజనీర్ పరిధిలో తగినంత మంది సిబ్బంది లేక కేసీ కెనాల్ స్థలాలు అన్యాక్రాంతం అవుతున్నాయన్నారు. కడప నగరంలో దాదాపు 5 కిలోమీటర్ల మేర కేసీ కెనాల్ ఉంటే అందులో పేరుకుపోయిన కదలని ముురుగు, చెత్తాచెదారం ,పిచ్చి మొక్కలతో అధ్వానంగా ఉందని విమర్శించారు. కడపలోని ఏఈ కార్యాలయం తలుపులు తెరిచి స్థానికుల ఫిర్యాదులు స్వీకరించే యంత్రాంగం ఉండేటట్లు రెగ్యులర్ ఏఈని, ఇతర సిబ్బందిని నియమించాలని వారు డిమాండ్ చేశారు. సిపిఐ నగర సహాయ కార్యదర్శి ఉద్దే మద్దిలేటి, నగర కార్యవర్గ సభ్యులు టక్కోలి మనోహర్ రెడ్డి, పకీరప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన గంగమ్మ జాతర

దువ్వూరు : మండల పరిధిలోని నారాయణపల్లె గ్రామంలో గురువారం గంగమ్మ జాతర మహోత్సవం ప్రారంభమైంది. 8న గురువారం ప్రారంభమైన జాతర ఉత్సవాలు సోమవారం వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జాతర సందర్భంగా ఉదయం 8 గంటలకు గ్రామ దేవతలకు పూజలు, 10 గంటలకు బొల్లేవు, గంగాపెట్టి గ్రామ ప్రవేశం చేశారు.

బాధ్యతలను కర్తవ్యదీక్షతో నిర్వహించాలి

- సిబ్బందికి వీసీ సూచన


వసతిగృహాల సిబ్బందితో మాట్లాడుతున్న వీసీ సుధాకర్, ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి

వైవీయూ : విద్యార్థులు ఉంటేనే మనమనందరం ఉన్నామనే విషయాన్ని గుర్తుంచుకుని ఎవరి బాధ్యతలు వారు కర్తవ్యదీక్షతో నిర్వహించాలని వైవీయూ వైస్ చాన్స్‌లర్ ఆచార్య చింతా సుధాకర్ స్పష్టం చేశారు. గురువారం వైవీయూలో వసతిగృహాల సంక్షేమాధికారులు, సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఎవరెవరు ఏయే విధులు నిర్వహిస్తున్నారనే పరిచయ కార్యక్రమం అయిన తర్వాత తన ఆలోచనా విధానాలను వీసీ సిబ్బందికి వివరించారు. విద్యార్థులకు నాణ్యతతో కూడిన ఆహార పదార్థాలను అందించాలని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సిబ్బందికి విద్యాలయం తరఫున రావాల్సిన ప్రయోజనాలను అందేలా చూస్తామన్నారు. ఇదే నేపథ్యంలో విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సంక్షేమ అధికారులు హాస్టళ్లను నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అసిస్టెంట్ డా. రెడ్డయ్య, వసతిగృహాల సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

వైవీయూ కేంద్రగ్రంథాలయం తనిఖీ

యోగివేమన విశ్వవిద్యాలయంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం కేంద్ర గ్రంథాలయాన్ని వీసీ సుధాకర్ గురువారం ఉదయం తనిఖీ చేశారు. పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డితో కలిసి కేంద్ర గ్రంథాలయాన్ని పరిశీలించారు. సమయపాలనకు ప్రాధాన్యత ఇవ్వాలని లైబ్రరీ అసిస్టెంట్ బి. ప్రసారావు, ఆర్. విజయ్‌కుమార్‌లను ఆదేశించారు. విద్యార్థులకు అవసరమైన ప్రతి పుస్తకం లైబ్రరీలో ఉండేలా చూస్తామన్నారు.

ఎంహెచ్‌ఓ సేవలు ఎనలేనివి


ఎంహెచ్‌ఓ ప్రశాంత్‌వర్ధన్‌ను సత్కరిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్ తదితరులు

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ ప్రశాంత్ వర్ధన్‌కు నగరపాలక అధికారులు, ఉద్యోగులు ఘనంగా వీడ్కోలు పలికారు. వైద్య, ఆరోగ్య శాఖ నుంచి డిప్యూటేషన్‌పై వచ్చిన ఆయన ఏడాది కాలం పూర్తవడంతో తిరిగి మాతృశాఖకు వెళ్లారు. ఈ సందర్భంగా కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్ చంద్, డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, శానిటరీ సెక్రటరీలు ఆయన్ను సత్కరించారు. నగరంలో పారిశుద్ధ్యాన్ని పరిరక్షించేందుకు ప్రశాంత్‌వర్ధన్ చేసిన కృషిని కొనియాడారు.

ఇన్‌చార్జి ఎంహెచ్‌ఓగా రమణారెడ్డి

మున్సిపల్ హెల్త్ ఆఫీసర్‌గా ఉన్న డా. ప్రశాంత వర్ధన్ రిలీవ్ కావడంతో డిప్యూటీ కమిషనర్‌గా ఉన్న రమణారెడ్డికి ఎంహెచ్‌ఓగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం. కొత్త ఎంహెచ్‌ఓ వచ్చే వరకూ ఆయన డిప్యూటీ కమిషనర్‌తోపాటు, ఎంహెచ్‌ఓ బాధ్యతలు కూడా పర్యవేక్షించనున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె: అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన వీరపునాయునిపల్లె మండలం యు రాజుపాలెం సచివాలయ పరిధిలోని తంగెడుపల్లె గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకోవడంతో ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని సూసించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, సర్పంచు సుబ్బరాయుడు, స్థానిక నాయకులు వీరభద్రారెడ్డి, శంకర్‌రెడ్డి, ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధి ఏపీఓ వెంకటసుబ్బయ్యతో పాటు పలువురు మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంగమేశ్వరుడిని దర్శించుకొన్న ఎమ్మెల్యే

అనిమెల సంగమేశ్వరుడిని గురువారం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ చైర్మన్ శివాంజనేయరెడ్డి, అర్చకులు సుబ్రమణ్య శర్మ ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు.

మత్స్యకారుల ఆర్థిక ఎదుగుదలకు చేయూత

చెన్నూరు : స్థానికంగా చేపల వినియోగాన్ని పెంచడం , తద్వారా మత్స్యకారులకు ఉపాధి కల్పన, ఆదాయం కల్పించడమే ప్రభుత్వ సంకల్పమని ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మత్స్యకారుడు వర్దిబోయిన ఎరుకలయ్యకు ఆటో (త్రీ వీలర్ వాహనం) అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి పశు సంపద యోజన పథకం ద్వారా, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా సబ్సిడీతో ఫిష్ ఆంధ్ర పథకం ద్వారా మత్స్యకారులకు చేపల వ్యాపారం చేసుకునేందుకు చక్రాల వాహనాలు, మూడు చక్రాల వాహనాలు, ద్విచక్ర వాహనాలు ఇవ్వడం జరుగుతోందన్నారు. ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి అనేక పథకాలను చేపట్టడం జరిగిందన్నారు. ఫిష్ ఆంధ్ర పథకంలో 10 లక్షల రూపాయలతో (యూనిట్) చేపల దుకాణం ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. అదే విధంగా రూ. 20 లక్షల యూనిట్ (ఫిష్ ఆంధ్ర సూపర్), రూ. 50 లక్షల యూనిట్‌తో దుకాణాలు ఏర్పాటు చేసుకోవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జి ఎస్ భాస్కర్ రెడ్డి, ఫిషరీష్ డిప్యూటీ డైరెక్టర్ నాగలింగాచార్యులు, కడప మత్స్య అభివృద్ధి అధికారి కిరణ్ కుమార్, మద్దిలేటి, జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షులు నారాయణ స్వామి, గ్రామ మత్స్య సహాయకురాలు మస్తానమ్మ, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పెండ్లిమర్రి: పార్టీలకు అతీతంగా అర్హులందరికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం కొత్తగంగిరెడ్డిపల్లె గ్రామ సచివాలయం పరిధిలోని సోగాల్‌పల్లె, సోగాల్‌పల్లె హరిజనవాడ గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా సీఎం జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. కొందరు పక్కాగృహాలు, రైతు భరోసా, పింఛన్ రాలేదని అడిగారు. వారికి పథకాలు ఎందుకు రాలేదని అధికారులను అడిగి తెలుసుకున్నారు. తక్షణం వారి సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పట్టణ కమిటీ ఎన్నిక

ప్రొద్దుటూరు : మండలంలోని పెన్నానగర్‌లోని సీపీఐ కార్యాలయంలో గురువారం నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఏపీ మున్సిపల్ వర్క ర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. యూనియన్ పట్టణ అధ్యక్షుడిగా బి.రామయ్య, కార్యదర్శిగా మధు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నిర్మల, ఉపాధ్యక్షుడిగా వెంకటలక్షుమ్మ, నారాయణమ్మ, నాగరాజు, గురుమూర్తి, ఉప ప్రధాన కార్యదర్శిగా రవిప్రసాద్, కార్యదర్శులుగా రూబెన్, సురేష్, ప్రమీలరాణి, నారాయణమ్మ, కోశాధికారిగా బోదనం చిన్న ఓబులేసులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పి.సుబ్బరాయుడు సమాజ అభివృద్ధిలో, ప్రజారోగ్య బాధ్యతల్లో మున్సిపల్ కార్మికుల పాత్ర అత్యంత కీలకమైనదని తెలిపారు. కార్మికుల ఆరోగ్య రక్షణ కోసం ఉద్యమించాలని పేర్కొన్నారు.

ఉత్సాహంగా సాగిన 'చదవడం మాకిష్టం'

- నేటితో విద్యార్థుల వేసవి శిక్షణ శిబిరాలు ముగింపు
- నేడు బహుమతి ప్రదాన సభ


వేసవి శిక్షణ శిబిరాలకు హాజరైన విద్యార్థులు (ఫైల్)

కడప కల్చరల్ : కథలంటే పిల్లలకే కాదు...పెద్దలకూడా కూడా ఇష్టమే. ముందుతరంలో పెద్దలు చిన్నారులకు కథలు చెప్పేవారు. ఇప్పుడు ఆ అవసరాన్ని గ్రంథాలయాలు తీరుస్తున్నాయి. చిన్నారుల్లో చదివే గుణాన్ని పెంచడంతోపాటు ఆలోచన, సమయస్ఫూర్తి, సమస్యల పరిష్కారం, ఆత్మస్థైర్యం తదితర అంశాలను పెంచే కథలను గ్రంథాలయాలు చిన్నారుల వేసవి శిబిరాలకోసం ప్రత్యేకంగా రూపొందించి అందుబాటులో ఉంచాయి.

×చదవడమంటే మాకిష్టం. అందులోనూ కథలు చదవడం అంటే మరీ ఇష్టం అంటున్నారు చిన్నారులు. 30 రోజుల విద్యార్థుల వేసవి శిక్షణా శిబిరాలు జిల్లా అంతటా విజయవంతంగా సాగాయి. ఈ ఉత్సాహంతో గ్రంథపాలకులు, అధికారులు శుక్రవారం ముగింపు ఉత్సవాలను నిర్వహించనున్నారు. శిబిరాలలో ప్రతిభ చూపిన చిన్నారులకు సర్టిఫికెట్లు, బహుమతులను అందజేయనున్నారు.

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్‌గా విద్యాధికురాలైన లింగాల ఉషారాణి రావడంతో జిల్లా గ్రంథాలయ సంస్థ వేసవి శిక్షణా శిబిరాల్లో ప్రత్యేకించి చదవడం మాకిష్టం కార్యక్రమానికి కొత్త జోష్ లభించింది. ఆమె స్వయంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంతోపాటు దాదాపు అన్ని శాఖా గ్రంథాలయాలకు వెళుతూ వేసవి శిబిరాలను ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. దీంతో గ్రంథాలయ అధికారులు, సిబ్బంది కూడా ఉత్సాహంగా ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించి విద్యార్థులతో అమలు చేయించారు. ఈసారి ఎండలు అసాధారణంగా ఉండడంతో శిక్షణా శిబిరాలకు వచ్చే విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సంస్థ చైర్ పర్సన్, కార్యదర్శి అమీరుద్దీన్, ఇతర సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టారు. చిన్నారులకు వడదెబ్బ తగలకుండా ఎప్పటికప్పుడు హోమియో మందులు అందజేస్తూ చల్లని తాగునీటిని అందుబాటులో ఉంచడమే కాకుండా అన్ని పూటల మజ్జిగను అందజేశారు.
- జిల్లా గ్రంథాలయం నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరం ముగింపు సభను శుక్రవారం ఉదయం 9.00 గంటలకు నిర్వహించనున్నారు. నగరంలోని సీపీ బ్రౌన్ గ్రంథాలయంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి చైర్ పర్సన్‌తోపాటు విద్యాశాఖ, అనుబంధ శాఖల అధికారులు హాజరు కానున్నారు. శిబిరాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు వారు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందించి ఆశీర్వదించనున్నారు.